క్లుప్తంగా

దుర్గాలమ్మ సన్నిధిలో జియ్యాని



పూజలు నిర్వహిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: గొల్ల కంచరపాలెంలోని దుర్గాలమ్మ వారిని మంగళవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అమ్మవారికి శ్రీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ పెద్దలు శ్రీధర్‌ను సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

మల్కాపురం: స్థానిక గాంధీజీవీధికి చెందిన పుట్ట నూకరత్నం అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న గాం. దీజీవీధి శ్రీవినాయక సేవా సంఘం ప్రతినిధులు చందాలు వేసుకుని ఆ మహిళకు రూ. 5వేలు మంగళవారం అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సర్వసిద్ధి పైడిబాబుయాదవ్, చట్టి సూరిబాబుయాదవ్,గొంప శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మహిళలు

విశాఖ విద్య: జీవీఎంసీ90వ వార్డు సుసర్ల కాలనీ గిరి వేంకటేశ్వర ఆలయం వద్ద పాదచారులకు, వాహనదారులకు మంగళవారం మజ్జిగ అందించారు. బిల్వపత్ర ట్రస్ట్ సభ్యులు మూర్తి, ప్రవంతి ఆధ్వర్యంలో ఆ దారిలో వెళ్లే వందలాది మందికి మజ్జిగ పంపిణీ చేశారు. బిల్వ పత్ర ట్రస్ట్ ద్వారా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వెంకటరమణారావు, యామిజాల శ్రీనివాసరావు తెలిపారు. ఎండల తీవ్రత తగ్గేంత వరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అప్పారావు తదితరులు

విశాఖ విద్య: తెలుగు జాతి అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల చిన అప్పారావు అన్నారు. ఎన్ఏడీలో మంగళవారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భీశెట్టి రవీంద్ర, సభ్యులు ప్రసన్న హుస్సేన్, గణేష్, వెంకట్రావు, శేఖర్, షాలిని, అరుణ పాల్గొన్నారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్'తో రక్షణ పొందండి

ఉక్కునగరం: ఊరెళ్తున్నారా లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో రక్షణ పొందండని క్రైం పోలీసులు భరోసా ఇస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–11కు చెందిన ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో ఊరెళ్తూ స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సౌత్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ టి. రుక్మాంగదరావు నేతృత్వంలో ఆ క్వార్టర్‌కు వచ్చి సీసీ కెమెరాను అమర్చి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు.

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

- ఆర్‌వో హుస్సేన్ సాహెబ్
- కౌంటింగ్ నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో హుస్సేన్ సాహెబ్

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) హుస్సేన్ సాహెబ్ కోరారు. జ్ఞానాపురంలోని జోన్–5 జోనల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పోలీస్ ఉన్నతాధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీలో ఉన్న అభ్యర్థులతో కౌంటింగ్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఫారం 18 ద్వారా కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించి గుర్తింపు కార్డుతో కౌంటింగ్ కేంద్రానికి పంపించాలని రాజకీయ పార్టీలకు సూచించారు. కౌంటింగ్ సిబ్బందితో పాటు ఏజెంట్లు మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రం లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు.

ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్లను హమాలీలు తీసుకుని వస్తారని, వారికి డ్రెస్ కోడ్ ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూములు పోటీ అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తెరుస్తారన్నారు.

- ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ చేయాలన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సీతో నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్‌ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని స్పష్టం చేశారు. కంట్రోల్ యూనిట్‌లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికీ క్లాక్ ఎర్రర్ వస్తే రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని చెప్పారు. కంట్రోల్ యూనిట్‌లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సీలో నమోదైన ఓట్లను ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో గోపాలపట్నం తహసీల్దార్ విజయభాస్కర్, ములగాడ తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, జోన్–8 జోనల్ కమిషనర్ హైమవతి, ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్ల సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గందరగోళం వద్దు

కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని ఆర్వో హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దన్నారు. వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ స్లిప్పులను బ్లాక్ కవర్లలో భద్రపర్చి సీల్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తం వీడియో తీయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు ధరించాలన్నారు. పోటీ అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ హాల్ వద్దకు సకాలంలోకి చేరుకోవాలని తెలిపారు. ఆర్వో అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బయటకు వెళ్లకూడదన్నారు.

చలివేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం!



మర్రిపాలెం రోడ్‌లో తాగునీటిని పోస్తున్న విద్యార్థి



గోపాలపట్నం రోడ్‌లో ఖాళీగా చలివేంద్రం

విశాఖ విద్య: వేసవిలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చలి వేంద్రాల్లో తాగునీటిని అందించేందుకు రోజువారీ వేతనంతో కూలీలను ఏర్పాటు చేసిన అధికారులు వారి సవ్యంగా అందుబాటులో ఉంచడం లేదు. ఎన్ఏడీ సెంటర్‌లో మంగళవారం ఇటువంటి దృశ్యాలే కనిపించాయి. ఎన్ఏడీ సెంటర్ నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రలో ఎవరూ లేకపోవడంతో పాదచారులే తాగునీటిని తీసుకొని తాగారు. సమీపాన బస్టాప్ ఉండడంతో దీన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు అంటున్నారు. అదే విధంగా ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి మర్రిపాలెం వైపు వెళ్లే దారిలో హైస్కూల్ స్థాయి విద్యార్థులను చలివేంద్రాల్లో వినియోగిస్తున్నారు. మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలు అందరికీ ఉపయోగకరంగా ఉండేలా జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటి నిర్వహణపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తాటి ముంజలకు గిరాకీ



తాటిముంజులు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

విశాఖ విద్య: ఎండల తీవ్రతతో జనం అల్లాడిపోతున్నారు. వేడిగాలులతో బయటకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. రోజు వారీ పనుల్లో భాగంగా బయటకు వచ్చే ప్రజానీకం ఎండ నుంచి ఉపశమనం పొందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా వేసవిలో సమృద్ధిగా లభించే తాటిముంజులు తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఎన్ఏడీ సెంటర్‌లో తాటి ముంజుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరానికి సమీపంలోని విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతంలో లభించే తాటికాయలను ఆటోల ద్వారా తీసుకొచ్చి కొంతమంది ఇక్కడ అమ్ముతున్నారు. డజను రూ.50 కు లభిస్తుండటంతో శీతల పానీయాల కంటే ప్రయాణాల్లో ఉన్న వారు వీటిని తినేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. కొంతమంది ఇళ్లకు సైతం తీసుకెళ్తున్నారు. రవాణ చార్జీలు పోను తమ కూలి డబ్బులు మిగులుతున్నాయని కొత్తవలస నుంచి తాటి కాయలు తీసుకొచ్చి ఎన్ఏడీలో విక్రయిస్తున్న వెంకట రమణ అనే వ్యక్తి తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఎల్జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం: గోపాలపట్నం లాఅండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం సాయంత్రం గోపాలపట్నం ఎల్జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారితో పాటు రికార్డులు సక్రమంగా లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పలువురికి అపరాధరుసుము విధించారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కొండదేవతమ్మ జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో వెలసిన గ్రామదేవత కొండదేవతమ్మ జాతర మహోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ముగింపు ఉత్సవాల్లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాలు గ్రామాల్లో ఉండడం వల్ల ఆ గ్రామాలు దుష్టశక్తుల నుంచి కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ జూరెడ్డి గంగరాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.సత్యనారాయణ, బి.సూర్యనారాయణ, మధు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెద్దలతో గౌరవంగా మెలగాలి



చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇస్తున్న డ్యాన్స్ టీచర్

మల్కాపురం: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే పెద్దలతో ఎలా మసులు కోవాలి, వారిని ఎలా గౌరవించాలన్న అంశాలను నేర్పాలని కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం అన్నారు.మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెద్దలతో గౌరవంగా మెలగాలని, జంతువుల పట్ల ప్రేమతో మెలగాలని,ప్రకృతిని పరిరక్షించాలని సూచించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని,సినిమాలు,టీవీలకు దూరంగా ఉండి విజ్ఞానం పెంచే గ్రంథాలయాలకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న బెహరా



దుర్గా మల్లేశ్వరాలయంలో పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ వార్షి కోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ,బూరెడ్డి గోపి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కంచరపాలెం: రవీంద్రనగర్‌లో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామం, విభూది, పుష్పాలతో స్వామికి అర్చకులు రామ కృష్ణశర్మ అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్మయిదేవి

ఎంవీపీ కాలనీ: జిల్లా స్థాయి రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ఏటా మే 28న నిర్వహిస్తుందన్నారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఆ సమయంలో మహిళల్లోని అపోహలు, అభద్రత భావాన్ని తొలగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అంశంపై బాలికల్లో అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలన్నారు. రుతుక్రమ సమయంలో పరిశ్రుత పాటించకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో బాలికలు, మహిళలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఊహల గుసగుసలాడే శీర్షికన శ్రీదేవీ మహానటి సంస్థ నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయకులు ఎంఎస్ మాధవ్ పాడిన ఎదురీతకు అంతం లేదా, మద్దిల అప్పారావు, రమణి పాడిన ఈ మూగ చూపేలా.. సుధీర్, రమణి పాడిన కోటలోని మొనగాడా వంటి గీతాలు శ్రవణానందం కలిగించాయి. కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంఘ సేవకులు, సంస్థ కార్యదర్శి విజయరమణి, కోశాధికారి రమణి, గౌరవాధ్యక్షురాలు కందర్ప రాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అమ్మాజీ రావు, అప్పారావు, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు దివాకర్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులందించిన వివరాలిలా.. రామ్మూర్తి పంతులుపేట (ఆర్పీపేట) పవర్ స్టేషన్ పక్కన ఉన్న పార్కు వద్ద ఆటోలో మంగళవారం బోర దివాకర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సదరు మృతుడు కొంతకాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. అలాగే తల్లి దగ్గర కొంతకాలం ఉన్నాడు. తర్వాత విభేదాలు రావడంతో వారికి కూడా దూరంగా ఉంటూ బయట గడుపుతున్నాడు. ఇతడికి మద్యం సేవించే అలవాటు ఉంది. మద్యం ఎక్కువ సేవించడం వల్ల మృతి చెందాడా, ఆహారం లేక మరణించాడా, మరే ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

దుర్గాలమ్మా.. చల్లగ చూడమ్మా



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ అమ్మవారు



దుర్గాలమ్మ వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు




హారతులు అందుకుంటున్న భక్తులు


విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ మారు వారం పండగను మంగళవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామదేవతను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం అమ్మవారి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు సామూహిక కీర్తనలు మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.అనంతరం భక్తులు ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర

కంచరపాలెం : దుర్గానగర్ గొల్ల కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన దుర్గమాంబ అమ్మవారి జాతర శ్రీరామ సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలతో భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు, మాజీ ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశి కూడలి, దయానందనగర్, గోకుల్ నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్న ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు, మజ్జిగలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. సుమారు 34 ఘటాలను ఆలయం వద్దకు చేర్చారు. కోలాటం, తప్పిటగుళ్లు, చిడతలు, నేలవేషాల నడుమ అమ్మవారిని ఊరేగించి ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఐదవ పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు



భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు శర్మ

హారన్ల మోతపై కఠిన చర్యలు



పెద్దహారన్లతో నడుపుతున్న బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: తీవ్రమైన శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని, హారన్లు మోగిస్తూ తిరుగుతున్న బుల్లెట్ వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో నిబంధనలకు విరుద్ధగా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని ప్రయాణిస్తున్న ముగ్గురు ద్విచక్ర వాహనచోదకులను అదుపులోకి తీసుకున్నారు.

కుటుంబ వ్యవస్థకు రామాయణమే మూలం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట: భారతీయ కుటుంబ వ్యవస్థ.. రామాయణం అనే అంశంపై మంగళవారం ప్రసంగ కార్యక్రమం జరిగింది. భారతీయ శిక్షణ్ మండల్ నిర్వహణలో స్థానిక బీవీకే కళాశాలలో చెరుకూరి సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రధాన వక్తగా మాట్లాడారు. మన కుటుంబ వ్యవస్థ సమాజానికి బలమైన ప్రాకారమని, ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి వ్యవస్థ లేదని తెలిపారు. కాలక్రమంలో ఇక్కడ కూడా అనుబంధాలు పతనమవుతున్నాయన్నారు. రామాయణం ప్రాచీన కుటుంబ వ్యవస్థకు మూలమని తెలిపారు. రామాయణంలోని అన్నదమ్ముల అనుబంధం సమాజానికి ఆదర్శమని, అయోధ్య, లంక, కిష్కింధల్లో భిన్న సంస్కృతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కొత్తూరు రమణ పాల్గొన్నారు.